**ఆకాశవాణి హైదరాబాద్ విభాగం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 15.02.2026** **సమయం: 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. రాష్ట్ర ఆదాయ వనరులు పెరిగి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలనే లక్ష్యంగా పని చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.
2. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి 32వ అఖండ జ్యోతిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ ఉదయం ప్రారంభించారు.
3. పోటాపోటీగా మారిన కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ ఎన్నిక నేపథ్యంలో మరో ఇద్దరు స్వతంత్ర్య కార్పోరేటర్లు కేంద్రమంత్రి బండి సంజయ్ సమక్షంలో బిజెపీలో చేరారు.
4. బంజారాల ఆధ్యాత్మిక గురువు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది.

...............................................................

**భట్టి**

రాష్ట్ర ఆదాయ వనరులు పెరిగి, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఖమ్మం జిల్లా స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రపంచంతో పోటీపడే స్థాయిలో తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి మూడు

ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను దాటి అభివృద్ధి చెందాలని ఆ పరమశివుని వేడుకున్నట్లు తెలిపారు.

**బైట్ - భట్టి విక్రమార్క**

.........ఖమ్మం

**కిషన్ రెడ్డి**

యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి 32వ అఖండ జ్యోతి యాత్రను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ ఉదయం ప్రారంభించారు. హైదరాబాద్ బర్కత్ పురలోని యాదాద్రి భవన్ లో మంత్రి యాత్రను సంప్రదాయ బద్ధంగా ప్రారంభించారు. ఈ యాత్ర బర్కత్ పుర నుంచి బయలుదేరి యాదాద్రికి చేరుకుంటుంది.

.........జీఎస్

**కోమటిరెడ్డి**

వందల ఏళ్ల చరిత్ర గలిగిన చారిత్రాత్మక ఆలయాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లగొండలోని పానగల్ పచ్చల, ఛాయా సోమేశ్వరాలయాలలో స్వామివారి దర్శనం చేసుకొని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

......నల్గొండ

**పొన్నం - కరీంనగర్**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా ఎవరు ఎన్నికైనప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తుందని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడలో ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ...

**బైట్ - పొన్నం ప్రభాకర్**

..........సిరిసిల్లా

**బీజేపీలో చేరిక**

కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచిన ఇద్దరు స్వతంత్ర్య కార్పొరేటర్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ బీజేపీలో చేరారు. వారిద్దరికీ కేంద్ర మంత్రి కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఇప్పటికే ఒక ఇండిపెండెంట్, మరో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కార్పొరేటర్ బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. తాజాగా మరో ఇద్దరి చేరడం, ఎక్స్ అఫిషియో హోదాలో బండి సంజయ్ ఓటుతో కలిపి.. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో మొత్తం బీజేపీ బలం 35కు చేరింది.

......కరీంనగర్

**రాహుల్**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ స్థానాల్లో విజయం సాధించడంపై ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సాధించిన ఈ విజయం కాంగ్రెస్ కార్యకర్తలు, తెలంగాణ ప్రజలకు దక్కుతుందని ఆయన ఎక్స్ లో పేర్కొన్నారు.

.......జీఎస్

**సంత్ సేవాలాల్**

బంజారాల దైవం, ఆధ్యాత్మిక గురువు, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు హైదరాబాద్ బంజారాహిల్స్ లోని సంత్ సేవాలాల్ బంజారాభవన్ లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు.. సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో పాటు, పలువురు హాజరయ్యారు.

.......జీఎస్

**అగ్నివీర్**

ఆర్మీలో అగ్నివీరులుగా వివిధ కేటగిరీల్లో చేరాలనుకునే తెలంగాణలోని అన్ని జిల్లాలకు చెందిన ఔత్సాహికులైన యువకులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు, దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు రక్షణ శాఖ పౌర సంబంధాల అధికారి హరి నాయక్ తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

..........డెస్క్

**ఉత్సవాలు**

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారి ఆలయంలో పునర్నిర్మాణ పనులు జరుగుతున్నందున, అనుబంధ ఆలయమైన శ్రీభీమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు.

.........సిరిసిల్ల

**పొన్నం**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ భీమేశ్వర స్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తో కలిసి వేదమంత్రాలు, మేళ తాళాల మధ్య సంప్రదాయబద్ధంగా ఆలయంలోకి చేరుకొని భీమేశ్వరస్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులకు వేములవాడ రాజ రాజేశ్వర స్వామి ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించగా, ఈవో రమాదేవి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు చెప్పారు.

........సిరిసిల్ల

**టీటీడీ**

తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున డిప్యూటీ ఈవో లోకనాథం, అధికారులు వేములవాడ భీమేశ్వరస్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వీరికి రాజ రాజేశ్వరస్వామి ఆలయ ఈవో రమాదేవి, ఘనంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం తిరుమల తిరుపతి ఆలయ డిప్యూటీ కార్యనిర్వాహణాధికారి లోకనాథం మాట్లాడుతూ....

**బైట్ - తిరుమల తిరుపతి ఆలయ డిప్యూటీ కార్యనిర్వాహణ అధికారి లోకనాథం**

.........సిరిసిల్ల

**గుత్తా**

తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మహాశివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాస పూజలను భక్తి ప్రవత్తులతో నిర్వహిస్తున్న భక్తులందరికీ శివయ్య ఆశీర్వాదం ఎల్లవేళలా ఉండాలని సుఖేందర్ రెడ్డి ఆకాంక్షించారు.

......... నల్గొండ

**శివరాత్రి**

కరీంనగర్ జిల్లాలో మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లాకేంద్రంతో పాటు.. అన్ని ప్రాంతాల్లోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తున్నారు.

జగిత్యాల జిల్లా ధర్మపురి గోదావరి నదీ తీరంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి లక్ష్మీ నరసింహస్వామిని, రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

సారంగాపూర్ మండలంలోని దుబ్బ రాజరాజేశ్వర స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం పక్షాన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. ఈస్గాం ఆలయంలో సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు దంపతులు, జిల్లా కేంద్రాల్లోని సందీప్ నగర్ శివాలయంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంచిర్యాల జిల్లా లోని వేలాల మల్లన్న, కత్తెర శాల మల్లన్న ఆలయాలను రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోని బుగ్గ రాజరాజేశ్వర ఆలయం, గౌతమేశ్వర ఆలయం, గూడెం గుట్ట ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. చెన్నూరు పవిత్ర పంచ క్రోష ఉత్తరవాహిని గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించేందుకు భక్తులు బారులు తీరాడంతో గోదావరితీరం జనసంద్ర మైంది.

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. కాల్వ నరసింహ స్వామి ఆలయం, కదిలి ఆలయం లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

సూర్యాపేట జిల్లాలో తెల్లవారు జామునుంచే శైవ క్షేత్రాలు కిటకిట లాడుతున్నాయి. మెల్లచెరువు స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పిల్లలమర్రి చారిత్రక ఎర్రకేశ్వర స్వామి వారి దేవాలయంలో భక్తులు అభిషేకాలు నిర్వహించి ఉపవాస దీక్షలు చేపట్టారు.

సంగారెడ్డి జిల్లాలోని పురాతరమైన కేతకి సంగమేశ్వరాలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఏర్పాటు చేసిన జల లింగానికి పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు.

హన్మకొండలోని చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో రుద్రేశ్వర స్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

.........కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లా, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సూర్యాపేట,
సంగారెడ్డి, హన్మకొండ జిల్లాలు